క్లుప్తంగా

జీజీహెచ్‌లో పండ్లు పంపిణీ



గుంటూరు మెడికల్: క్రేన్ సంస్థల అధినేత గ్రంధి సుబ్బారావు జయంతి సందర్భంగా విద్యాదాత గ్రంధి కాంతారావు అభిమాన సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కొత్తపేట జలగం రామారావు మెమోరియల్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్‌లు పంపిణీ చేశారు. గుంటూరు జీజీహెచ్‌లో రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం అధ్యక్షుడు శిఖాకొల్లి అభినేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ పోతురాజు సమత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రంధి సుబ్బారావు ఎంతో మందికి ఆదర్శమని, ఆయన తనయుడు కాంతారావు పేద ప్రజలకు ఉన్నత చదువులు అందించేందుకు భూరి విరాళాలు ఇస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కె.అశోక్‌కుమార్, వి.మణిదీప్, వి.మిధున్‌కుమార్, వి.కేధార్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు ప్రారంభం



పాత గుంటూరు: బ్రాడీపేటలోని శ్రీ సీతారామాంజనేయ నగర సంకీర్తన సంఘం, శ్రీ సిద్దేశ్వరీ పీఠ పాలిత ఓంకార క్షేత్రంలో 90 వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు. 94వ సంఘ వార్షికోత్సవాలు బుధవారం నగర సంకీర్తనతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం, గణపతి పూజ, హనుమత్ లక్ష్మణ సీతా సమేత కోదండ రామస్వామికి అభిషేకార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివార్ల కల్యాణాలలో భాగంగా వల్లభామ్మ సమేత మహాగణపతి స్వామి, గంగా భువనేశ్వరి స్వామి వార్లకు వేదమంత్రాలతో కనులపండువగా కల్యాణాలను నిర్వహించారు. విశేష హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. సాయంత్రం శ్రీమద్ వాల్మీకి విరచిత శ్రీమద్రామాయణంపై ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమాలను కార్యదర్శి శ్రీమన్నారాయణమూర్తి పర్యవేక్షించారు.

గాంధీజీ గ్రామ స్వరాజ్యం.. జగనన్న పాలనలో సాకారం



గుంటూరు రూరల్: అంతా కలిసి సమిష్టిగా కృషి చేసి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఉమ్మారెడ్డి రమణ తెలిపారు. బుధవారం 48వ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.అనంతరం ఆత్మీయ సమావేశంలో పత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. రెడ్డిపాలెం మెయిన్‌రోడ్డు ఆదిత్యనగర్ 1వ లైను నుంచి రిజర్వాయర్ వరకూ రూ.2 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన డివిజన్ వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో ఉమ్మారెడ్డి రమణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని తెచ్చారన్నారు. సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీలకు, కుల,మతాలకు అతీతంగా 32 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలను అందించి, వారి సొంతింటి కలను సాకారం చేసి జగనన్న చరిత్ర సృష్టించాడన్నారు. జగనన్నకు మనమంతా అండగా ఉండి మరోసారి ఆయననను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సైనికుల్లా కృషి చేద్దామన్నారు. జెడ్పీటీసీ సభ్యులు ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సర్పంచ్‌లు, సొసైటీల చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో బీసీలకు అధిక ప్రాధాన్యత

నెహ్రూనగర్: రాష్ట్రంలో బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు గూడూరి నానిముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం ఎన్‌జీఓ కాలనీలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో బీసీలకు పెద్ద పీట వేస్తూ, అధిక శాతం పదవులు ఇచ్చి, బీసీలకు గుర్తింపు ఇచ్చిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీలో బీసీ కోటాలో అనేక పదవులు అనుభవించిన వారు చంద్రబాబు మాయలో పడి సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. సామాజిక సాధికారితకు బాటలు వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను 2024లో తిరిగి సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత బీసీలపై ఉందన్నారు.

48 గంటల్లో అదుపులోకి..

- వాంతులు, విరేచనాలు తగ్గుముఖం
- ఇంటింటి సర్వేతో సత్ఫలితాలు
- ఏడు ప్రాంతాల్లో మెడికల్ క్యాంప్‌లు



అధికారులకు సూచనలు చేస్తున్న మేయర్ కావటి, పక్కన కమిషనర్ కీర్తి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో కొద్ది రోజులగా వాంతులు, విరేచనాలతో ప్రజలు భయాందోళనకు గురై ఆసుపత్రులకు వెళుతున్న పరిస్థితి తెలిసిందే. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, నగర కమిషనర్ కీర్తి చేకూరి వీటికి గల కారణాలను అన్వేషించడంతో పాటు, ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం ద్వారా పరిస్థితిని 48 గంటల్లో అదుపు చేయగలిగారు.

ఏడు ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు

వాంతులు, విరేచనాలు ఎక్కువగా వస్తున్న నగరంలోని శారదా కాలనీ, సంగడి గుంట తదితర ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఏడు ప్రాంతాల్లో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్య లు తలెత్తుతున్న శారదాకాలనీ 9వ లైన్ 150వ వార్డు సచివాలయంలో, 4వలైను అభయాంజనేయ స్వామి కల్యాణ మండపం, 15వ లైన్ ఇమ్మానియే లు ప్రార్థనా మందిరంలో, కారిమ్కుల కాలనీ, డీఆర్ ఫంక్షన్ హాల్, బీబీ నగర్ ఇమ్మడి ఫంక్షన్ హాల్, లాంచెస్టర్ రోడ్ కానూరు దివ్య హాల్, ఎల్ఆర్ కాలనీ దేవర కల్యాణ మండపంలో వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు.

డెప్యూటీ కమిషనర్ల స్థాయిలో క్యాంపుల నిర్వహణ

ప్రతి క్యాంప్‌లో డిప్యూటీ కమిషనర్ల స్థాయిలో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు రెవెన్యూ అధికారులకు బాధ్యతలు కేటాయించారు. ప్రజలు ఏమైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే సమస్య తీవ్రతరం అయ్యే వరకు ఉండకుండా మెడికల్ క్యాంప్‌లో వైద్యులను సంప్రదించాలని మైక్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కలిస్తున్నారు. మెడికల్ క్యాంపుల్లో తగిన వైద్యులు, వైద్య సిబ్బంది, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుతున్నారు.

ఇంటింటికీ ఆరోగ్య సర్వేతో అదుపులోకి...

అలాగే నగరంలో ప్రతిరోజు తాగునీటి సరఫరా జరిగే సమయంలో 520 క్లోరిన్ శాంపిల్స్ తీయడంతో పాటు, శారదాకాలని, సంగడిగుంట, లాంచెస్టర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో 32 మంది ఎమినిటి కార్యదర్శులతో కలిసి ప్రతి వీధిలో తాగునీరు అంది స్తున్న ట్యాంకర్ల వద్ద కూడా క్లోరిన్ శ్యాంపిల్స్ తీస్తున్నారు. క్లోరిన్ తగిన మోతాదులోనే ఉందన్నారు. అనుమానిత ప్రాంతమైన 35 వార్డ్ సచివాలయాల పరిధిలో సుమారు 105 మందికి పైగా వెల్ఫేర్, ఏఎన్ఎం, మహిళా పోలీస్‌లు, 560 మంది వలంటీర్లు బృందాలుగా ఇంటింటి ఆరోగ్య సర్వే చేసున్నారు. సర్వేలో ఇంటిలోని కుటుంబ సభ్యుల ఆరోగ్యం, తాగునీటిని ఏ విధంగా వాడతున్నారనే తదితర వివరాలు సమగ్రంగా తెలుసుకుని వారికి తగిన అవగహన కల్పిస్తున్నారు.

శారదాకాలనీలో ఇంటింటి ట్యాప్ కనెక్షన్ చెక్ చేస్తున్న సిబ్బంది

శారదాకాలనీలో నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ తిరుగుతూ ట్యాప్ కనెక్షన్‌లు చెక్ చేస్తున్నారు. ఎక్కడైన పైపులైన్ లీకులు ఉన్నాయో క్షుణ్ణంగా పరిశీలించి వాటికి మరమ్మతులు చేయడంతో పాటు కాలువను క్రాస్ చేస్తూ వెళ్లే పైపులైన్లను పక్కకు మారుస్తున్నారు. కొన్ని పాతపైపులైన్ల స్థానంలో కొత్త పైపులైన్లు వేయడం జరిగింది. అదే విధంగా 29 మంది అధికార, సిబ్బందితో స్పెషల్ శానిటేషన్ నిర్వహిస్తూ విధుల్లోని కాలువలను శుభ్రం చేశారు.

నాణ్యతకు, మన్నికకు కేరాఫ్ భారతి సిమెంట్



మేస్త్రీకి బీమా బాండ్‌ను అందజేస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: భవన నిర్మాణాలు శాశ్వతమైనవని, నిర్మాణం కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేయబడిన నాణ్యమైన సిమెంట్ ఎంచుకోవాలని భారతీ సిమెంట్స్ అసిస్టెంట్ మేనేజర్ (మార్కెటింగ్) పూల సురేష్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఎన్.భవానీ శంకర్ సూచించారు. బుధవారం చుట్టుగుంట సెంటర్‌లోని పటేల్ ఏజెన్సీస్ సహకారంతో భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ మేస్త్రీలు, కార్మికులకు అవగహన సదస్సును నిర్వహించారు.

ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతుందని తెలిపారు. కట్టడాలు పూర్తి నాణ్యతతో దీర్ఘకాలం మన్నేందుకు దోహదపడుతుందన్నారు. సిమెంట్ తయారీకి నాణ్యమైన ముడి పదార్థాలనే తమ కంపెనీ ఎంచుకుంటుందన్నారు. భవానీ శంకర్ మాట్లాడుతూ భారతి సిమెంట్ వినియోగించిన కాంక్రీట్‌తో వేసిన శ్లాబులను ఏడు రోజుల అనంతరం తమ కంపెనీ ప్రతినిధులు వచ్చి నాణ్యతా పరీక్షలను చేసి భారతి సిమెంట్ నాణ్యతను భవన నిర్మాణ మేస్త్రీలు, యాజమానులకు వివరిస్తామన్నారు. ఇందుకు సంబంధిత డీలరు ద్వారా వివరాలు తెలుసుకుని తమకు సమాచారం అందిస్తే సరిపోతుందన్నారు. మేస్త్రీల సందేహాలను నివృత్తి చేశారు. సదస్సుకు హాజరైన మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున ఉచిత బీమా సదుపాయం కల్పించి బాండ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పటేల్ ఏజెన్సీస్ ప్రొపయిటర్ దేవిరెడ్డి సీతారామరెడ్డి, మేస్త్రీలు, కార్మికులు పాల్గొన్నారు.

వాగ్దేవీ అనుగ్రహంతో ఉన్నతస్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న పత్రి వేణుగోపాల్

గుంటూరు ఎడ్యుకేషన్: చదువుల తల్లి అనుగ్రహంతో విద్యార్థులు విజ్ఞానవంతులుగా జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని కాటూరి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పత్రి వేణుగోపాల్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో వసంత పంచమి సందర్భంగా బుధవారం సరస్వతీమాత జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు సరస్వతీదేవి అనుగ్రహం తప్పనిసరిగా ఉండాలన్నారు. గురు శాపాన్ని పొందిన యాజ్ఞవల్క్య మహర్షి సరస్వతీదేవిని ఉపాసించి తిరిగి జ్ఞానాన్ని పొందారని తెలిపారు. సరస్వతీమాత అనుగ్రహం లేనిదే విద్యలో రాణించలేరని, విద్యార్థులు చదువుల తల్లిని పూజించి విజ్ఞానవంతులు కావాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ తనను ఆరాధించిన దేవతలకు, ఋషులకు, మానవులకు వాక్కు, విద్య, బుద్ధి, జ్ఞానం వంటి ఎన్నో వరాలను ఇచ్చి వారిని ఎల్లవేళలా కాపాడుతుందన్నారు. విద్యార్థులకే కాకుండా ఏ రంగంలో నైనా రాణించాలంటే సరస్వతీ అనుగ్రహం కావాలన్నారు. ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ సరస్వతీదేవి జ్ఞానాన్ని ప్రసాదిస్తుందని, వీణ, పుస్తకం, స్ఫటిక మాలను ధరించి, శ్వేత వస్త్ర. దారిణియై, హంసవాహినిగా, శుద్ధసత్త్వ స్వరూపిణిగా దర్శమిస్తుందన్నారు. సరస్వతీ పూజ అనంతరం విద్యార్థులంతా సరస్వతీ ద్వాదశ నామ స్తోత్రం చదివారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎ.భాను మురళీధర్, అధ్యాపకులు డాక్టర్ పి.దేవేంద్ర గుప్త, డాక్టర్ ఎ.అంజనీకుమార్, ఆర్.జయశైలజ, ఎస్.కే.నాగరాణి, కె.శ్రావణి, కె.కవిత, పి.నాగమణి, జి.భాగ్యమ్మ, ఆర్.స్వామి, ఎ.అప్పారావు, ఎస్.సంగీతా పాల్గొన్నారు.

డీ–1 సెక్షన్లో 4,390 సర్వీసుల తనిఖీ



సమీక్షిస్తున్న ఏఈ శ్రీనివాసబాబు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు డీ–1 సెక్షన్ పరిధిలోని బ్రాడీపేట, అరండల్‌పేటలో బుధవారం విద్యుత్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. 55 మంది అధికారులు, 165 మంది సిబ్బంది, 55 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు, 4,390 సర్వీసులు తనిఖీలు చేసి అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 118 మందికి రూ. 6.70 లక్షలు అపరాధ రుసుముగా విధించారు. అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరిల్లో విద్యుత్ వాడుతున్న పది మందికి రూ. 65 వేలు అపరాధ రుసుము విధించారు. అనుమతి లోడుకంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 108 మందికి రూ. 6 లక్షలు అపరాధ రుసుము విధించారు. ఈసందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసబాబు మాట్లాడుతూ వినియోగదారులు విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేలా చూసుకోవాలన్నారు. సీలు లేకపోయినా, తుప్పు పట్టినా వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. ఉద్దేశ్యపూర్వకంగా సీలు తొలగించినా, గాట్లు పెట్టినా విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసు నమోదు చేయడం జరుగుతోందన్నారు. పనిచేయని మీటరు నుంచి విద్యుత్ వాడుకున్నా, ఉండవలసిన మీటరుకు బదులు, వేరే మీటరు పెట్టి సీలు లేకపోయినా విద్యుత్ చౌర్యంగా నిర్ధారణ చేస్తామన్నారు. మొదటి తప్పిదానికి కాంపౌండింగ్ పద్ధతిలో అపరాధ రుసుం చెల్లించినచో కేసు నుంచి విడిచిపెడతారన్నారు.

లాలాపేటలో భార్యపై భర్త కత్తితో దాడి



గాయపడిన దాక్షాయని

పట్నంబజారు: భార్యపై భర్త కత్తితో దాడిచేసిన సంఘటన బుధవారం గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోవాడ వెంకటనాగ దాక్షాయని మహిళతో 12 సంవత్సరాల క్రితం నగరంపాలెంకు చెందిన బాలకృష్ణతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం ఉన్నారు.

గత ఏడాదిన్నర క్రితంగా భార్య, భర్తల మధ్య విభేదాలు రావడంతో వేరుగా ఉంటున్నారు. దాక్షాయని ప్రస్తుతం లాలాపేట పరిధిలోని పెద్దపులిసందులో ఆమె పుట్టింటిలో ఉంటూ గార్డెన్స్‌లోని ఓ షాపులో పనిచేస్తోంది. అయితే భార్యభర్తల మధ్య విభేదాల నేపథ్యంలో దిశ పోలీసు స్టేషన్‌లో కేసు ఉంది. బుధవారం ఇంటికి నడుచుకుంటూ వెళుతున్న దాక్షాయనిని భర్త బాలకృష్ణ మేదర బజారు వద్ద కత్తితో దాడి చేసి గాయపరిచాడు. తీవ్ర గాయాలు కావడంతో లాలాపేట పీఎస్ సమీపంలో ఘటన జరగడంతో కానిస్టేబుళ్లు అప్పలనాయుడు, ద్వారకా తిరుమలరావు, రమేష్‌లు బాధితురాలిని హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం బాధితురాలు చికిత్స పొందుతోంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వలంటీర్ల సేవలు అమూల్యం

నగర కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: వలంటీర్ల సేవలు అమూల్యమని, వారిని అభినందించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వలంటీర్లకు వందనం కార్యక్రమం చేపట్టడం ద్వారా వారికి తగిన గుర్తింపునిస్తున్నారని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వార్డు, గ్రామ సచివాలయ వ్యవస్థలోని కార్యదర్శులు, వలంటీర్లు ప్రభుత్వ పథకాలను కుల,మతాలకు అతీతంగా అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ అవినీతి రహిత సేవలు అందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థ అమలుకు ముందు ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రభుత్వ సేవల కోసం పలుమార్లు తిరుగుతూ ఉండేవారని, ప్రస్తుతం వారి ఇంటి వద్దకే నేరుగా వలంటీర్ల ద్వారా కార్యదర్శులు తగిన సేవలందిస్తున్నారన్నారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో వీరి సేవలు శ్లాఘనీయమన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 12 వందల మంది వివిధ కార్యదర్శులు, సుమారు 3,900 మంది వలంటీర్లతో నగరంలోని సుమారు 10 లక్షల మంది జనాభాకు ఉదయం పారిశుద్ధ్య పనుల నుంచి రాత్రి వీధి దీపాల వరకు వార్డు సచివాలయ వ్యవస్థ ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. ముఖ్యంగా గత నాలుగు రోజులుగా నగరంలో శారదా కాలని, ఐపీడీ కాలనీ, సంగడిగుంట, లాంచెస్టర్ రోడ్ తదితర ప్రాంతాల్లో ఉత్పన్నమైన అనారోగ్య సమస్యల నుంచి ప్రజలకు ఆరోగ్యకర విధానాలు పాటించడంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, కలుషిత ప్రాంతాల్లో తయారయ్యే ఆహారాన్ని తీసుకోకూడదనే నగరపాలక సందేశాన్ని ప్రతీగడపకు అతి తక్కువ సమయంలో చేర్చారన్నారు. సదరు ప్రాంతాల్లో ప్రాథమిక దశలోనే రోగులను గుర్తించేందుకు జరుగుతున్న ఇంటింటి సర్వేలో ముఖ్య పాత్ర పోషించి, సత్వరంగా మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంలో దోహదపడ్డారని తెలిపారు. వలంటీర్ల సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను అందించడం, అందులో గుంటూరు నగరపాలక సంస్థ నుంచి కూడా వలంటీర్లు ఉండడం అభినందనీయమన్నారు.

ఎంఈవో పోస్టులు ఉపాధ్యాయులతో భర్తీ చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరుజోన్–3 పరిధిలోని ఎంఈవో–1, ఉర్దూ డీఐ, హెచ్ఎం పోస్టులను ప్రభుత్వ యాజమాన్యంలోని ఉపాధ్యాయులతో ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వర రెడ్డికి ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం సంఘ రాష్ట్ర నాయకుడు చలపతిరావు సారథ్యంలో ఆర్జేడీని కార్యాలయంలో కలిసిన ఉపాధ్యాయులు ఆయనకు వినతి పత్రం సమర్పించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు తప్పకుండా ఉద్యోగోన్నతులు చేపడతామని హామీ ఇచ్చారు. ఆర్జేడీని కలిసిన వారిలో సంఘ నాయకలు షేక్ ఎండీ ఖాసిం, ఎస్వీఆర్ ప్రసాద్, జయరామిరెడ్డి, ఏవీఎస్ ప్రసాద్, వసుంధర, యలమంద, కలాం ఉన్నారు.

వాహనాలకు ఇన్సూరెన్సు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ షేక్ కరీం

పట్నంబజారు: ప్రతి ఒక్కన వాహన యజమాని వాహనాలకు ఇన్సూరెన్సు కలిగి ఉండాలని డీటీసీ షేక్ కరీం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.బ్రహ్మారెడ్డి చెప్పారు. స్వర్ణ భారతినగర్‌లోని డీటీసీ కార్యాలయంలో బుధవారం వాహన డ్రైవర్లకు ఇన్సూరెన్సు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ వాహనాలకు ఇన్సూరెన్సు లేకపోతే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు పూర్తిస్థాయిలో వాహన యజమానికి నష్టం జరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు ఇన్సూరెన్సు కలిగి ఉండటం వల్ల ఎంతో లబ్ధి చేకూరుతోందన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి గ్రంధి సుబ్బారావు

నివాళులు అర్పించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

పట్నంబజారు: జీవితాంతం విలువలతో బతికిన గొప్ప మహోన్నతమైన వ్యక్తి క్రేన్ సంస్థల వ్యవస్థాపకుడు గ్రంధి సుబ్బారావు అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గ్రంధి సుబ్బారావు జయంతిని పురస్కరించుకుని సంపత్ నగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో జరిగిన పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. ముందుగా గ్రంధి సుబ్బారావు దంపతుల విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న గొప్ప వ్యక్తి గ్రంధి సుబ్బారావు అని కీర్తించారు. ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలను ఏమాత్రం మరిచిపోని మంచి మనిషిగా మంత్రి ప్రశంసించారు. అనంతరం ఆయన కుమారుడు గ్రంధి కాంతారావు కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించారు. గ్రంధి సుబ్బారావు జయంతి సందర్భంగా ఆయా అన్నదాన సత్రాలు, వృద్ధాశ్రమాల కోసం సిద్ధం చేసిన అన్నదాన వాహనాలను మంత్రి విడదల రజిని చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రంధి సుబ్బారావు దంపతుల విగ్రహాలకు నివాళులు అర్పిస్తున్న మంత్రి విడదల రజిని

ఆ.. అయిదుగురు మహా 'భారతరత్నాలు'

- యువతకు స్ఫూర్తిదాయకులు
- రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ యలమంచిలి శివాజీ, పక్కన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: భారతావని ముద్దుబిడ్డలుగా ఎదిగి, తరతరాలకు దారిదీపం కాగల దార్శనికులుగా జాతిగుండెలో ఒదిగిన గొప్ప వ్యక్తులను ఆలస్యంగానైనా భారత రత్నలుగా గుర్తించడం, గౌరవించటం అపురూపమైన విషయమని రైతు నాయకులు, రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ యలమంచిలి శివాజీ అన్నారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈమధ్య పురస్కారాలు అందుకున్న ఐదుగురు పి.వి.నరసింహారావు, చరణ్ సింగ్, ఎం.ఎస్. స్వామినాథన్, ఎల్.కె.ఆద్వానీ, కర్పూరీ ఠాగూర్‌లు భారత రత్న పురస్కారాలకి నూటికి నూరుశాతం అర్హులన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి

విలువలు గల రాజకీయ నాయకుడిగా దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రిగా కేంద్రమంత్రిగా ఎ.ఐ.సి.సి అధ్యక్షుడిగా పనిచేసిన దామోదరం సంజీవయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి అని సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, ఇంజినీర్ విశ్లేషకులు ఎన్. సదాశివం అన్నారు. బుధవారం దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

యువతరం రాజకీయాల్లోకి రావాలి

దేశానికి నిజమైన సంపద యువతరమేనని అలాంటి యువత నేడు రాజకీయాల్లోకి రానంత కాలం దేశంలో అవినీతి విద్వేష రాజకీయాలు కొనసాగుతూనే ఉంటాయని, యువతలో నాయకత్వ లక్షణాలు పెంచే కార్యక్రమాలు నిర్వహించాలని సంస్థ సీనియర్ సభ్యులు ఎస్.చంద్రశేఖర్ అన్నారు.

ఘనంగా తులసి ధర్మచరణ్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న తులసి ధర్మచరణ్, డాక్టర్ పి.చంద్రశేఖర్

కొరిటిపాడు(గుంటూరు): వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ జన్మదిన వేడుకలను స్థానిక వేద సీడ్స్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌ను ధర్మచరణ్ కట్ చేశారు. అనంతరం వేద సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా.పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ధర్మచరణ్ ఎంతో మంది పేద విద్యార్థులకు, క్రీడాకారులకు ఆర్థికంగా వెన్నంటే ఉంటున్నారన్నారు. అనంతరం తులసి ధర్మచరణ్ సన్నిహితులు, హోటల్ సుభాని నిర్వాహకులు తాడి శ్రీనివాస్, తిమ్మిశెట్టి కల్యాణ్ ఆధ్వర్యంలో పెదకాకాని మండలం భ్రమరాంబపురం కాలనీలోని లీమా హోమ్ ఆశ్రమ పాఠశాలలో నివశిస్తున్న చిన్నారులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రెడ్డిపాలెంలోని మానవతా వృద్ధాశ్రమంలో డొంకెన మురళీకష్ణ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆర్ఆర్‌కే క్యాటర్స్ అధినేత రేజేటి రామకష్ణ ఆధ్వర్యంలో నల్లచెరువులో నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ తనతో తోడుగా వస్తున్న వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డా. చిట్టెం లక్ష్మణ్, డా.కంఠా జగదీష్, సుంకర సతీష్, చెన్నంశెట్టి శివ, ఆంజనేయులు, కన్నసాని బాజి, యరబ్రోతు వాసు, కన్నెగంటి బాలు, కార్పొరేటర్‌వెంకట రమణ, రేజేటి రామకృష్ణ, తన్నీరు శివ శంకర్, వీరిశెట్టి సుబ్బారావు, జి. రంగారావు, గణేష్, చందు, బండ్రెడ్డి చందు, ఆళ్ళ శ్రీనివాసరావు, గుబ్బా సతీష్, గాజుల సాయిరాం, వేద సీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ప్రారంభం



విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మనోహర్‌నాయుడు

గుంటూరు రూరల్: ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలను కల్పించి ప్రజా సంక్షేమానికి కృషి చేయటం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. బుధవారం ఏటుకూరు జగనన్న కాలనీ, రెడ్డిపాలెం, అంకిరెడ్డిపాలెం గ్రామాల్లో నూతనంగా అధునాతన టెక్నాలజీతో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌లను ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ ఏటుకూరు జగనన్న కాలనీలో రూ. 6 కోట్లతో అధునాతన టెక్నాలజీని ఉపయోగించి ఇండోర్ సబ్‌స్టేషన్‌తో పాటు రెడ్డిపాలెం గ్రామంలో రూ 3.5 కోట్లు, అంకిరెడ్డిపాలెం గ్రామంలో రూ 3.5 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్‌లు రూ 13.కోట్లతో నిర్మించి ప్రారంభించటం జరిగిందన్నారు. శివారు గ్రామాల్లో విద్యుత్ సమస్యలను తొలగించేందుకు నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌లను నిర్మించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ తిరుమల శెట్టి శ్రీనివాసబాబు, సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎం శ్రీనివాసరావు, సుబ్బరాయుడు, ప్రసాదరావు విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకురాలికి డాక్టరేట్

గుంటూరు రూరల్: విద్యార్థి, అధ్యాపకుడి లక్ష్య సాధనకు తమ కళాశాల ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె శ్రీనివాస్ తెలిపారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకురాలి అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మీ చైతన్యకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. 'రీ ఇన్ఫోర్స్ గార్లెట్ అల్యూమినియం కాంపోసిట్ ఫర్ పిస్టన్ అప్లికేషన్' అనే అంశంపై తన పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకురాలిని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కృష్ణప్రసాద్‌లు అభినందించారు.